క్లుప్తంగా

250 మందికి వైద్య పరీక్షలు



సదుం: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సదుం: మండలంలోని కలకటవారిపల్లెలో శశి హాస్పిటల్స్ (పీలేరు) ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మంది రోగులకు పరీక్షలు చేశారు. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించి ఈసీజీ, జీఆర్‌బీఎస్, బీఎండీ, న్యూరో స్కాన్‌ను రోగులకు నిర్వహించినట్లు డాక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వైద్యులు హేమంత్‌కుమార్ రెడ్డి, ధరణీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు హిందూ సామ్రాజ్యోత్సవ యాత్ర

పుంగనూరు: పట్టణంలోని ఎన్‌ఎస్.పేటలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఆదివారం నిర్వహించే హిందూ సామ్రాజ్యోత్సవ యాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని హిందూజాగరణ సమితి ప్రతినిధి త్రిమూర్తిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. త్రిమూర్తిరెడ్డి మాట్లాడుతూ జైశ్రీరామ్...జైశివాజీ... అనే నినాదంతో హైందవజాతి చైతన్యమే భారత సంక్షేమం, జగత్ కల్యాణం అని తెలిపారు. చత్రపతి శివాజీ ఆశయాలను కాపాడేందుకు యాత్రలో వేల సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పరమేష్, గంగాధర, హరి, వెంకటేశు, రవిరాజు, నాగరాజు, శివ పాల్గొన్నారు.

పత్తికొండ పీహెచ్‌సీలో ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేసుకుంటున్న ప్రజలు

గంగవరం: మండలంలోని పత్తికొండ పీహెచ్‌సీలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని బెంగుళూరు వైదేహీ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా కేన్సర్ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో 98 మందికి పరీక్షలు నిర్వహించారు. 9మంది కేన్సర్ బాధితులను గుర్తించి పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి, సర్తాజ్, వైదేహి ఆస్పత్రి వైద్యులు కిరణ్, విష్ణువర్ధన్, అన్నపూర్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఎన్నికలు రేపు

పుంగనూరు: పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జూలై 1న సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు ఉదయం 10 గంటలకు సమావేశం కావాలన్నారు. సమావేశంలో నిర్ణయించి, సేవాగుణంతో ఉన్నవారిని సంఘ ప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. సమావేశానికి రిటైర్డ్ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

జ్ఞానదీపాలు పుస్తకాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న దాతలు

గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ముద్రించిన జ్ఞానదీపాలు పుస్తకాలను మండలంలోని అన్ని పాఠశాలలకు శనివారం ఉచితంగా వితరణ చేశారు. ఈ పుస్తకాలను సంస్థ అధ్యక్షుడు తులసినాథంనాయుడు ఎంఈఓ-1, 2 వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాఠశాలల సిబ్బందికి అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రార్థనలో చెప్పడానికి కావాల్సిన సూక్తులు, సామెతలు, నీతి పద్యాలు, ఈ పుస్తకాల్లో పొందుపరిచినట్టు తెలిపారు.

సీఐను కలిసిన మున్సిపల్ చైర్మన్



సీఐను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్

కుప్పం: కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడును మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ సన్మానించారు. నూతనంగా కుప్పం అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అభినందనలు తెలిపారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు ఎంఆర్ సురేష్, రంగయ్య, మోహన్‌రాం, గణపతి, సయ్యద్ ఆలీ, వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

మష్రూమ్స్.. అదుర్స్

- మస్త్ రుచి ఉండే నాటు పుట్టగొడుగులు
- ఈ సీజన్‌లో అరుదుగా లభిస్తాయి
- పుట్టలు, గుట్టల్లో మాత్రమే మొలుస్తాయి
- గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టంగా తినే శాకాహారం
- వీటిలో విరివిగా పోషకాలు

గంగవరం/పలమనేరు: అచ్చం మాంసాహారం లాగే వాసన ఘుమఘుమలాడుతుంది. తింటుంటే మాంసాహారం లాగే ఉంటుంది. కానీ ఇది పూర్తి శాకాహారమే. కేవలం ఈ వర్షాకాల సీజన్‌లో మాత్రమే పెరిగే నాటు పుట్టగొడుగులు. ముఖ్యం వేరుశనగ సాగుకోసం తొలకరి దుక్కులు దున్నేవేళ ఇవి చేలలో కనిపిస్తుంటాయి. వీటికోసం గ్రామీణ ప్రజలు చేలల్లో, కొండలవద్ద వెతుకుతుంటారు. దొరికాయంటే ఇక ఆ ఇంట్లో పండగే. ఎన్నో పోషకాలు కలిగిన నాటు పుట్టగొడుగులు గురించి నేటి తరానికి పెద్దగా తెలియకపోవచ్చు. ఇప్పుడంతా షెడ్లలో పెంచే మష్రూమ్స్ మాత్రమే తెలుసు. కానీ పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పల్లెల్లో ఇప్పుడు నాటు పుట్టగొడుగు మసాల చారు ఘుమఘుమలాడుతున్నాయి.

సహజసిద్ధంగా మొలుస్తాయి..

పుట్టగొడుగులు ఇంగ్లిష్‌లో మష్రూమ్స్ అంటారు. వీటిలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి పెంచేవి.. రెండు వాటికవే పుట్టలు, గుట్టల్లో మొలిచేవి (నాటు రకం) ఇవి అటవీ ప్రాంతాల్లో ఏడాదికి ఒకేసారి అరుదుగా దొరికే నాటు పుట్టగొడుగులు మొలుస్తుంటాయి. విత్తనం లేకుండా వాటికవే సహజసిద్ధంగా మొలకెత్తే పుట్టగొడుగులు చాలా అరుదుగా



భూమిలో మొలిచిన పుట్టగొడుగులు

లభిస్తాయి. ఇవి మనిషికి ప్రకృతి ప్రసాదించిన మంచి ఆహారం. చిత్తకార్తెలో ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు లేక వాతావరణం చల్లబడినప్పుడు మాత్రమే ఇవి ఎక్కువగా లభిస్తాయి. ఇవి ఎక్కువగా పుట్టలపై గొడుగు ఆకారంలో మొలుస్తాయి కాబట్టి వీటిని పుట్ట గొడుగులు అంటారు. పుట్టగొడుగుల్లో విషపూరితమైన జాతులు అనేకం ఉన్నాయి. అందులో ఆహారంగా తీసుకునే పుట్టగొడుగులు సహజసిద్ధంగా పెరిగి తెలుపురంగులో ఉంటాయి. పుట్టగొడుగులు సేకరణ కోసం పల్లెటూళ్లలో ప్రజలు ఉదయాన్నే అడవులకు గుంపులుగా



అటవీ ప్రాంతాల్లో అరుదుగా దొరికే నాటు పుట్టగొడుగులు

పయనం సాగిస్తారు. ఉదయం నుంచి గుట్టలు, పుట్టలు తిరిగి మధ్యాహ్నానికి దొరికినవి తీసుకొచ్చి ఇంట్లో వండుకుంటారు.

పుట్టగొడుగులతో ఆరోగ్య ప్రయోజనాలు..

పుట్ట గొడుగులు తినడం వలన చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు అంటున్నారు. వీటిని ఆహారంగా తీసుకోవడం వలన మానవ శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడం రక్తపోటు అదుపులో ఉండడం, కేన్సర్ లక్షణాలు నివారించడం, ఇన్‌ఫెక్షన్లు దూరం కావడం, గుండె సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం, చర్మంపై మడతలు తగ్గడం, బరువు అదుపులో ఉండడం వంటి ఆరోగ్య ప్రయోజనాలు ఎక్కువగా కలుగుతాయి. అయితే కుక్కకాటు, పాము కాటుకు గురైన వాళ్లు, ఆస్తమా, మూర్చ వ్యాధిగ్రస్తులు ఈ పుట్టగొడుగులు తీసుకుంటే అపాయమని ప్రజల్లో అపోహలు ఉన్నాయి. కానీ వీటిని ఆహారంగా తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు పూర్తిగా తగ్గుతాయే తప్ప ఎట్టి పరిస్థితిలోనూ ప్రాణహాని ఉండదు. అలాంటి అపోహలు పూర్తిగా మానుకుని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పుట్టగొడుగులు ఆహారంగా తీసుకోవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

పుట్టగొడుగులు తినాల్సిందే



ఈ శీతాకాలం వస్తే ప్రతి ఇంట్లో పుట్టగొడుగుల కూర వండాల్సిందే. ఇవి ఆరోగ్యానికి చాలా మంచిదని అంటుంటారు. అటవీ ప్రాంతాల్లోని చెట్ల కింద, కుంటలు కింద, మరీ ఎక్కువగా పుట్టల్లో ఎక్కువగా లభిస్తాయి. ఇంట్లో కూర వండుతుంటే చికెన్ కూరలాగా వాసన ఘుమఘుమలాడాల్సిందే. ప్రకృతి ప్రసాదించే ఈ పుట్టగొడుగులు కోసం ఊరంతా అడవుల్లో గాలించి తెచ్చుకుంటారు.

– విజయ్, బొమ్మనపల్లి, గంగవరం మండలం

నాటు పుట్టగొడుగులు ఆరోగ్యానికి చాలా మంచిది



పుట్టగొడుగులు ఆహారంగా తీసుకోవడం వలన శరీర ఆరోగ్యానికి వంద శాతం మంచిది. వీటిలో నీరు శాతం ఎక్కువగా ఉంటుంది. శరీరానికి కావాల్సిన పీచు పదార్థం బాగా అందుతుంది. వీటిలో ప్రొటీన్స్, విటమిన్స్ (బీ), (డీ) అధికంగా ఉంటాయి. అలాగే మినరల్స్ ధవనాలు, సెలీనియం, కాపర్, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి అనారోగ్య సమస్యలు నుంచి దూరం చేస్తుంది. తలవెంట్రుకలు రాలడాన్ని అదుపుచేస్తుంది. ఇన్ని రకాలుగా ఆరోగ్య ప్రయోజనాలు ఇందులో ఉన్నాయి.

– డా.యుగంధర్, వైద్యాధికారి, పత్తికొండ పీహెచ్‌సీ

ఆలయ అంగళ్ల గేటు వేలం రూ.8లక్షలు



వేలం పాడుతున్న పాటదారులు

గుడుపల్లె: గుడివంక శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ అంగళ్ల గేటు వేలం రూ.8 లక్షల 10వేలు పలికింది. శనివారం గుడివంక ఆలయం వద్ద దేవదాయశాఖ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలు నిర్వహించే సమయంలో హక్కుకు మాత్రమే వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాట పాడేవారు రూ.10 వేలు డిపాజిట్ చేసి వేలం పాట పాడారు. వేలం పాటలో లడ్డూ ప్రసాదం రూ.5 లక్షల 10 వేలు, అంగళ్ల గేటు ద్వారా రూ. లక్షా ఒక వెయ్యి, తలనీలాలు విక్రయం ద్వారా రూ.2 లక్షలు వరకు వేలం పాడారు. హెచ్చుదారులు పాడిన పాట ప్రకారం అప్పడికప్పుడు చెల్లించారు. అదేవిధంగా గంగాధరేశ్వరస్వామి ఆలయం లడ్డూ ప్రసాదం రూ.23 వేలు, అంగళ్ల గేటు రూ.32 వేలు, వాహనాలు గేటు రూ.62 వేలు, తలనీలాలు విక్రయం రూ.55 వేలు వేలంపాట పాడారు. ఆలయ ఈఓ చలపతి, నేతలు ఆర్ చంద్రశేఖర్, బాబునాయుడు, హేమాంబరగౌడు, రాజగోపాల్, డీకే చంద్రశేఖర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పటిష్టంగా జరగాలి

- మున్సిపల్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూలై 1న నిర్వహించే ఎన్టీఆర్ పింఛన్లను పటిష్టంగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్‌తోపాటు అధికారులతో పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల సామాజిక పింఛన్లు 4,682గా ఉన్నాయని ఇందుకు రూ.3.20 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని ఓ పండుగలా నిర్వహించాలని ఆదేశించారు. ఆర్వీ బాలాజీ, చాంద్‌బాషా, ఖాజా, మాబాషా, జగదీశ్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ గిరీషా

సదుం: వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు, డయేరియాపై శనివారం అవగాహన కల్పించారు. కలుషిత నీటితో అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని ఆమె చెప్పారు. విద్యార్థులకు తాగునీరు సరఫరా చేసే వాటర్ ప్లాంటును పరిశీలించారు. క్లోరినేషన్ విధానంపై పాఠశాల సిబ్బందికి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది నీలకంఠ, శిఖామణి పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్



కుప్పం: లోక్ అదాలత్‌లో జడ్జి



పుంగనూరు: లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి శిరీష్, పక్కన ఉమాదేవి

పుంగనూరు: సమస్యలను సత్వరం పరిష్కరించుకునేందుకు ప్రతిఒక్కరూ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని, వీటిని వేదికగా మార్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి, న్యాయవాదులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా 47 క్రిమినల్ కేసులు, 9 సివిల్ కేసులు, 29 బ్యాంకులకు చెందిన కేసులను పరిష్కరించారు. దీనిద్వారా రూ.43 లక్షలు పరిహారం పంపిణీ చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తే వాటిపై అప్పీల్ ఉండదన్నారు. అలాగే లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులకు స్టాంపుల నగదు వెనక్కి ఇస్తారనని తెలిపారు. సమావేశంలో అడిషనల్ పీపీ హరినాథరెడ్డి, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు, న్యాయవాదులు గల్లాశివశంకర్‌నాయుడు, వై.భాస్కర్‌రెడ్డి, బాలాజీకుమార్, ఆనంద్‌కుమార్, ప్రశాంతి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 85 కేసులు రాజీ

కుప్పం: కుప్పం కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 85 కేసులు రాజీకి పోయినట్లు జూనియర్ సివిల్ జడ్జి హరీఫాషేక్ తెలిపారు. వీటిలో 64 క్రిమినల్ కేసులు రాజీ రూ. 24,16 లక్షలు, 11 సివిల్ కేసులు రాజీ కోసం రూ.17.53 లక్షలు, బ్యాంక్‌కు సంబంధించి ఏడు కేసులు



పలమనేరు: కేసులను రాజీ చేసుకున్న కక్షిదారులతో జడ్జి శ్రీనివాసరావు

రూ.5.88 లక్షలు నగదు విషయంగా రాజీ చేసినట్లు ఆమె తెలిపారు. లోక్‌అదాలత్‌లో 85 కేసులకుగాను రూ.49,05,135 లక్షలు నగదు పరిష్కారం చేసినట్లు ఆమె తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రప్ప, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 127 కేసులు పరిష్కారం

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 127 కేసులు పరిష్కారంమయ్యాయి. ఇందులో సివిల్, క్రిమినల్, బ్యాంకులకు సంబంధించి మొత్తం రూ.57.94లక్షల విలువైన కేసులను రాజీ చేశారు.

పౌరుల హక్కులకు భంగం కలగరాదు



మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య, డీఈఈ మహేష్

పుంగనూరు: సమాజంలోని పౌరుల హక్కులకు భంగం కలిగితే తక్షణం చర్యలు తీసుకుంటామని, ఎవరు హక్కులకు భంగం కలిగించరాదని తహసీల్దార్ శివయ్య సూచించారు. శనివారం ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రాజ, నరసింహులు, చిన్నప్ప ఆధ్వర్యంలో మోదుగులపల్లె హరిజనవాడలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో కలిసి సభ్యులు అంటరానితనం, దళితులపై దాడులు, దళితులకు కల్పించాల్సిన రక్షణపై చర్చించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. మున్సిపల్ డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై పాడిఆవు మృతి



మృతిచెందిన ఆవు

చౌడేపల్లి: మేత మేస్తూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన పాడిఆవు విద్యుత్ షాక్‌కు గురై పాడిఆవు మృతిచెందిన సంఘటన ఆమినిగుంట వద్ద శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆమినిగుంటకు చెందిన నాగమణి పాడిఆవును మేపుకుంటూ పాల దిగుబడితో కుటుంబాన్ని పోషించుకుంటోంది. రోజూవారీగా ఆవును మేత కోసం తోలుకెళ్లగా అతి తక్కువ ఎత్తులోగల ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తోక తగలడంతో అక్కడిక్కడే షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు మృతితో నాగమణి బోరున విలపించింది. జీవనోపాధి కోల్పోయిన బాధిత కుటుంబాని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గణిత ఉపాధ్యాయుడి సేవలు అభినందనీయం



ఉద్యోగ విరమణ కార్యక్రమంలో సిబ్బంది

సదుం: గణిత ఉపాధ్యాయుడిగా వెంకటరమణారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా ఎంతో మంది ఉపాధ్యాయులకు ఆయన శిక్షణ అందించారని హెచ్‌ఎం చెప్పారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయన్ను సన్మానించారు. పూర్వ హెచ్‌ఎం ఫజురుల్లా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

10 కిలోల అండాశయం తిత్తి తొలగింపు



10 కిలోల అండాశయం తిత్తి తొలగించిన వైద్యులు

కుప్పం: పట్టణంలోని బీఆర్‌డీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిల్లో అరుదైన చికిత్సతో కడుపులో నుంచి 10 కిలోల అండాశయం తిత్తిని వైద్యులు తొలగించారు. తమిళనాడు రాష్ట్రం కురుంబేరి గ్రామానికి చెందిన పెన్నియమ్మన్ కడుపునొప్పితో బాధపడుతూ కుప్పం బీఆర్‌డీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. దీంతో వైద్యులు పెన్నియమ్మన్ వైద్యపరీక్షలు జరిపి కడుపులో ఉన్న 10 కిలోల అండాశయం తిత్తిని తొలగించేందుకు శస్త్రచికిత్స చేశారు. శనివారం 10 కిలోల అండాశయం తిత్తిని వెలికితీశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా ఉన్నట్లు బీఆర్‌డీ ఆస్పత్రి డైరెక్టర్ డా. సురేష్ తెలిపారు.

పత్తాలేని రూ.1.36 కోట్ల స్వాహా కేసు



పుంగనూరు మండల కార్యాలయము

పుంగనూరు: మండల కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి సునీల్ రూ.1.36 కోట్లు స్వాహా చేసిన సంఘటనపై జెడ్పీ సీఈఓ, స్థానిక మండల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. స్థానిక మండల కార్యాలయంలో కంప్యూటర్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీల్ మండలానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులు మొత్తం రూ.1.36 కోట్ల రూపాయలను తన బినామీ ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. సంవత్సరం కాలంగా జరిగిన ఈ తంతంగాన్ని ఎన్నికల ముందు గుర్తించిన అధికారులు మిన్నకుండిపోయారు. కోట్ల రూపాయలు స్వాహాలో బాధ్యులైన అధికారులు రామనాథరెడ్డి, నారాయణ, ఏఓ రాజేశ్వరికి షోకాజ్ నోటీసు జారీ చేసి జెడ్పీ సీఈఓ గ్లోరియా చేతులు దులుపుకున్నారు. దీనిపై పోలీస్ కేసు నమోదు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడం గమనార్హం. ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా నిధులను బినామీ ఖాతాలకు సునీల్ బదిలీ చేయడం వివాదాస్పదమైంది. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోయకొండ ఆదాయం రూ.1.17 కోట్లు



బోయకొండలో హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.1.17 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.1,16,21,723, బంగారం 60గ్రాములు, వెండి ఒక కేజీ 220 గ్రాములు, విదేశీ కరెన్సీ లభించినట్లు పేర్కొన్నారు. రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.78,829 సమకూరిందన్నారు. ఈ ఆదాయం 65 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ ఈఓ మునిరాజ, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో మాయం.. ముంగిట్లో ప్రత్యక్షం

- 20 రోజుల క్రితం చోరీ అయిన నగలు, నగదు
- ఇంటి ఆవరణలో లభ్యం

చౌడేపల్లె: ఇంట్లో చోరీ అయిన నగలు, నగదు 20 రోజుల తరువాత ముంగిట్లో ప్రత్యక్షమైన సంఘటన శనివారం వెలుగుచూసింది. బాధితులు భాస్కర్ దంపతుల కథనం మేరకు, కర్ణాటక రాష్ట్రం సోమదులపల్లె వద్ద గల కురవూరుకు చెందిన భాస్కర్ ఇంట్లో ఇరవై రోజుల క్రితం చోరీ జరిగింది. దుండగులు బీరువాలోని 25 గ్రాముల నగలు, రూ.25 వేలు నగదు తస్కరించారు. దీన్ని గుర్తించిన భాస్కర్ చుట్టుపక్కల వారిని విచారించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పెద్దమనుషులచే పంచాయితీ పెట్టి సత్యప్రమాణాలకు ప్రసిద్ధి చెందిన రాజనాల బండలో ఊర్లో వాళ్లందరి చేత ప్రమాణం చేయించాలని తీర్మానించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం ఇంటికో మనిషి ప్రమాణం చేయడానికి రాజనాల బండకు బయలు దేరాల్సి ఉంది. ఇంతలోనే ఇంటి ఆవరణలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. గుర్తించిన బాధితులు పెద్దమనుషులకు నగల విషయాన్ని తెలిపి కుటుంబ సభ్యులతో రాజనాల బండ ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. స్వామి మహిమతోనే పోయిన నగలు తిరిగి వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.



స్వామివారి నుంచి నగలు, నగదును అందుకుంటున్న భాస్కర్ దంపతులు